# 'అమ్మతనం

- డాక్టర్ ఎం. సుగుణరావు



"అమ్మా అన్నం పెట్టించండి తల్లీ!" అనే కేక.

కిటికీ తలుపు తెరిచాను.

మా రెండేళ్ళ అమ్మాయి ఆ బిచ్చగత్తెను చూసి భయపడి ఏడవటం ప్రారంభించింది. ఆమెను చూడగానే నా కడుపులో దేవినట్లయింది. ఆమె వయసు పాతిక లోపు ఉండొచ్చునేమో. మొలచుట్టూ చిన్న గుడ్డ పీలిక తప్ప వంటి మీద ఏ ఆచ్ఛాదనా లేదు.

"ఒక పాత చీర వుంటే ఇవ్వు" వంటింట్లో పనిచేసుకుంటున్న మా ఆవిడకు అరిచి చెప్పాను.

"వీళ్ళకు గుడ్డలిచ్చినా వేసుకోరు, ఏ స్టీలు సామాను వాడికో ఇస్తే ఉగ్గు గిన్నె అయినా ఇస్తాడు" అంది వంటింట్లోంచే.

"అది కాదు. ఒక పేదరాలి వంటి మీద గుడ్డ కప్పడం పుణ్యమే...నా మాట విని ఒకసారి బయటకొచ్చి చూడు. ఈమె పరిస్థితి ఎంత దీనంగా వుందో" అన్నాను.

మా శ్రీమతి పాత చీరతో బయటికొచ్చి ఆ బిచ్చగత్తెకు అందించింది. ఆ భిక్షుకి కళ్ళల్లో మెరుపు కనిపించిందేమో, నేను గమనించలేదు, నాకు మాత్రం ఒక మంచి పని చేసాననే తృప్తి మిగిలింది.

x x x

తర్వాతిరోజు సాయంత్రం సినిమాకు బయలుదేరాము సతీపుత్ర సమేతంగా. టిక్కెట్లు దొరుకుతాయో లేదో అనే ఆందోళనలో స్పీడుగా స్కూటర్ నడుపుతున్నాను. 'ఆపండి' అన్న మా ఆవిడ మాటలతో ఆగాను. మాకు కొంచెం దూరంలో నిలుచున్న వ్యక్తిని చూసి మా ఆవిడ కోపంగా ముందుకెళ్ళింది. నిన్న మేము చీర దానం చేసిన బిచ్చగత్తె. నిన్నటి యధా స్థితిలోనే కనిపించింది. రోడ్డు మీది జనం అదేపనిగా ఆమెను చూస్తున్నారు. మా ఆవిడ స్వరం పెంచింది, "నీకు సిగ్గూ శరమూ లేదా? ఆడ పుట్టుక పుట్టి గుడ్డలిప్పుకుని తిరుగుతావా, నిక్షేపంలాంటి చీరిచ్చాను, కట్టుకోవడానికేం..." ఆమె కేకలకు అందరూ చుట్టు చేరారు. బిచ్చగత్తె తలొంచుకుంది అవమాన భారంతో. తను ఇంకా తిట్ల ప్రహసనం కొనసాగించేదే, నేను సినిమాకు ఆలశ్యం అవుతుందని తొంద

రపెట్టడంతో వెంటనే స్కూటరెక్కింది. ఈ గొడవతో బాగా లేటయ్యాము. మా ఆవిడ మనసు, మనసులో లేదు.

"చూసారా ఇదంతా ఆ బిచ్చగత్తె మూలంగానే జరిగింది. దానికి చీర ఇచ్చి తల పోటు తెచ్చుకున్నాం" అంటూ నా మీద యుద్ధం ప్రకటించింది. మేం గృహోన్ముఖులం అయ్యేసరికి, ఒక కుర్ర వాడు ఎదురయ్యాడు. సార్ కావాలా అవి. బ్లాక్‌లో టిక్కెట్లు, మామూలు ధరకు రెట్టింపు. సినిమా చూడాలనే ఉత్సాహంతో వున్నాం కనుక మాట్లా డకుండా వెంటనే తీసుకుని హాల్లోకి నడిచాము. మా ఆవిడ అభిమానించే హీరోయిన్. సినిమా వానపాటతో ప్రారంభం అయింది. ఆమె ఇంచు మించు నగ్నంగా వర్తిస్తోంది. గుడ్డ పీలికల్లాంటివి వంటికి చుట్టుకుని-" అబ్బ వర్షంలో కూడా ఎంత చక్కగా చేస్తోందో డాన్సు. అంటూ మా ఆవిడ 'అడ్మైరింగ్'గా చూస్తోంది ఆ హీరోయి న్ని.

"బిచ్చగత్తె నగ్నత్వాన్ని బాహాటంగా ప్రదర్శిస్తోందని తిట్టిన మా ఆవిడ సినిమా హీరోయిన్ అదే స్థితిలో వుంటే మెచ్చు కొంటోంది. మా ఆవిడేమిటి సినిమా చూస్తున్న ప్రతి ప్రేక్షకుడు, ప్రేక్షకురాలు చేసేది అదే! ప్చ్, లోకం తీరే అంత అనుకున్నాను.

x x x

వారం రోజుల తర్వాత ఆఫీసులో పని వుండడంతో బాగా చీకటి పడిన తర్వాత వస్తున్నాను. సత్రం దగ్గర రావి చెట్టు కింద చీకట్లో కల్సిపోయినట్టుగా కూర్చుంది ఆ బిచ్చగత్తె తన యధా నగ్న స్థితిలో-వెళిపోతున్న వాణ్ణల్లా ఆమె పక్క నున్న ఇద్దరు పిల్లల్ని చూసి టక్కున స్కూటర్ ఆపాను.

మేము దానం చేసిన చీర ఆ పిల్లల వంటిపై వుంది గౌనుల రూపంలో. ఆమెను అపార్థం చేసుకుని, నలుగురి లోనూ నవ్వులపాలు చేసినందుకు నా మనసు బాధతో విలవిల్లాడింది. ఆ సమయంలో నాకు ఆమెలోని నగ్నత్వం కనబడలేదు. ఆమెలోని "అమ్మ"తనమే కనిపిస్తోంది.



# రోడ్డుమీద రూపాయిబిళ్ళ




ఈ రోజు పొద్దుట మనసంతా అసహనంగా వుంది. అందులోనూ నాలాంటి ప్రైవేటు కంపెనీ గుమ స్తాలకు మనసు అసహనంగా కాకుండా సంతో షంగా వుండటం ఈ కలియుగంలో సాధ్యం కాదేమో!

నెలాఖరురోజులు. మిట్టమధ్యాహ్నం నెత్తిమీద ఐ.ఎమ్.ఎఫ్. అప్పులా సన్నుగారు మండిపడు తున్నాడు.

జేబులో చిల్లిగవ్వలేదు. అయినా నాపిచ్చిగానీ చిల్లిగవ్వలు కాదు. మంచి గవ్వలుంటే మాత్రం మారకం గావడానికి ఇదేమన్నా శాతవాహనుల నాటికాలం కాదుగా!

అచ్చోసివదిలిన కాలేజీ కార్ఖానాలనుంచి కాల్చు కుతినే టుబాకో కంపెనీ కార్ఖానాలలోకి వచ్చిపడిన బ్రతుకు తెరువు. 'ఛీ దరిద్రపు బ్రతుకు. రూపాయికి ఠికానాలేదు'. తిట్టు కున్నాను. తలొంచుకుని, నడుస్తున్నానేమో! చూపులు నేలమీదే వున్నాయి.

'నమో! నమో! శ్రీరూపాయి, నమోస్తుతే శ్రీరూపాయీ!' పాడుకుంటూ నడుచుకుంటూ.. మైగాడ్...రెండడుగుల దూరంలో నాకళ్ళను నేనే నమ్మలేనంత నిజం! రోడ్డుమీద రూపాయిబిళ్ళ!

ఒకసారి తలెత్తి చూశాను. ఎవరూలేరు. ఎవరో ఒకతను కాస్తదూరంగా నిలబడి ఎటో చూస్తున్నాడు. గబగబా బుజ్జిముండలా ముద్దొ స్తున్న రూపాయిబిళ్ళ దగ్గరకు చేరాను.

మళ్ళీ ఎవరైనా చూస్తారేమోననే డౌటు! ఎంత యినా సగటు గుమాస్తా బుద్ధి. ఎవ్వరూ లేరు. 'హమ్మయ్య! ఈ రూపాయి నాదే!' గురువు గారు మన్మోహన్‌సింగ్ రూపాయి విలువేంటో ఈమధ్య భలే తెలియజేశారు బడ్జెటుద్వారా!

కాలితో చిన్నగా కదిపాను. చలనంలేదు. సదరు రూపాయిబిళ్ళగారు రోడ్డుమీదనుంచి కదల్లేదు. బుర్రలో కరెంటు పోయినపుడు వెలిగే ఆటోమేటిక్ బల్బ్‌లా ఐడియా వెలి గింది. వెంటనే జేబులోంచి మూడురోజుల్నించీ ఉతక్కుండా మురికిపట్టిన రుమాలు బైటికితీసి సైస్‌గా రూపాయిబిళ్ళమీద వేసాను.

ఏదో పనివున్నట్లు ఫోజుపెట్టి క్రిందికి వంగి రుమాలుతోబాటు రూపాయిబిళ్ళను లేపాను. ప్చ్...లాభంలేదు. అది రాలేదు. తలెత్తి చూసాను. అప్పటిదాకా దూరంగా వున్నతను దగ్గరికొస్తున్నాడు. రూపాయిబిళ్ళను లాగుతూనే వున్నాను. ఆశ్చర్యం. అది రావడంలేదు. కొంప దీసి ఇదేమన్న దెయ్యప్పిల్ల కాదుగదా! అని పించింది. పట్టువదలని విక్రమార్క మూర్ఖ ప్రయత్నాలు కొనసాగిస్తూనే అతన్ని గమ నిస్తున్నాను. అతను నాదగ్గరికొచ్చి నవ్వుతూ భుజంమీద చేయివేసి "ఆ రూపాయిబిళ్ళ రాదు" అన్నాడు.

"ఎందుకని?" అమాయకంగా బిక్కచచ్చి అడిగాను.

"చూసారా మా కంపెనీ జిగురు ఎంత స్ట్రాంగయినదీ బలమైనదో..." అతను కంపెనీ జిగురు సీసాలు బ్యాగ్‌లోంచి బైటికి తీస్తుంటే నాకళ్ళముందు రూపాయిబిళ్ళ గిర్రున తిరు గుతోంది.

—పి.వి. రమణకుమార్